2020

TELUGU

*Time: 3 hours* *Maximum Marks: 150*

---

***Instructions****: attempt* ***all*** *the questions*

***సూచనలు: అన్ని*** *ప్రశ్నలకు సమాధానాలు వ్రాయవలెను*

---

1. ఈ క్రింది వాటిలో ఒకదానికి 200 పదాలకు తగ్గకుండా వ్యాసం రాయండి. (20 మార్కులు)

(i) 'మహిళా సాధికారత'

(ii) అంధవిశ్వాసాలు – సమాజంపై ప్రభావం

(iii) విద్యార్థులపై చదువుల ఒత్తిడి

(iv) యువత – నైతిక విలువల ఆవశ్యకత

(v) తెలుగు భాషాభివృద్ధిలో ప్రభుత్వం, ప్రజల పాత్ర

2. క్రింది పద్యాలలో ఏవైనా రెండిటికి 100 పదాలకు తగ్గకుండా సమగ్ర వ్యాఖ్యను రాయండి.

(10 మార్కులు)

(i) చ|| సురుచిర తారకాకుసుమ శోభి నభోంగణ భూమి గాలమ
న్గరువపు సూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపగ నిశాసతి కెత్తిన క్రొత్త తోపు టెం
దెరయన నొప్పె సాంధ్యనవ దీధితి పశ్చిమ దిక్తటంబునన్

(ii) మ|| సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్

గురుపాదానతి కేలనీగి చెవులందు న్విన్కి వక్త్రంబునన్
స్థిరసత్యోక్తి భుజంబులన్విజయమున్జిత్తం బునన్సన్మనో
హర సౌజన్యము గల్గిన స్సురభిమల్లా! నీతివాచస్పతీ!

(iii) ఉ|| వేదపురాణ శాస్త్ర పదవీ నదవీయసియైన పెద్దము
త్తైదువ కాశికానగర హాటకపీఠ శిఖాధిరూఢ య
య్యదిమ శక్తి, సంయమివరా! యిటు రమ్మనిపిల్చె హస్తసం
జ్ఞాదరలీల రత్నఖచ్చితాభరణంబులు ఘల్లు ఘల్లనన్

3. కింది పేరాను చదివి, దాని సారాంశాన్ని 3వ వంతు పరిమాణంలో సంక్షిప్తీకరించి రాయండి.

(10 మార్కులు)

చంపకవతి యను పట్టణము గలదు. అందు సన్న్యాసులు పెక్కండ్రు వాసము చేయుచుండుదురు. అందు జూడాకర్ణుండను పరివ్రాజకుడు గలడు. అతడు తాను భోజనము చేసి మిగిలిన వంటకము భిక్షాపాత్రలో బెట్టి చిలుక కొయ్య మీద నుంచి నిద్రపోవును. నేను సద్దుచేయక దానిమీదికెగిరి ప్రతిదిన మావంటకము భక్షించి పోవుచుందును. ఒకనాడు చూడాకర్ణుడు తన స్నేహితుడు వీణాకర్ణుడను సన్న్యాసితో మాటలాడుచుండ మాటిమాటికి మీది వంక చూచి తన గిలుకకఱ్ఱతో నేలమీద గొట్టి నన్ను వెఱపించుచు వచ్చెను. అప్పుడు వీణాకర్ణుడు "చూడాకర్ణుడా! యేమది మీదు చూచి నేల కఱ్ఱతో దట్టుచున్నాడ"వని యడుగగా జూడాకర్ణుడిట్లనియె; "ఒక ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీది పాత్రమునందున్న యన్నము భక్షించిపోవుచున్నది. నాకు దీని యుపద్రవము పెద్దదిగా నున్నది"యని చెప్పెను. ఆ మాటలు వీణాకర్ణుడు విని "యెక్కడి యెలుక? యెక్కడి చిలుకకొయ్య? యింత యల్పజంతువున కింత పొడవున కెగురు బల మెక్కడినుండి వచ్చెను? దీని కేమయినను నిమిత్తము లేకమానదు. ఈ మూషికమునకింత బలిమియు నిక్కడి సదావాసమును, నిమిత్తము లేక సంభవింపవు" అని వీణాకర్ణుడు చెప్పగా విని చూడాకర్ణుడు "తడవులబట్టి యీ యెలుక యిక్కడ నొక లాగ తావు చేసికొని విడువక వాసము చేయుచున్నది. ఇట్లు వసించుటకు నిమిత్తము

తెలిసినది కాదు. త్రవ్వి చూచెదగాక" యని చెప్పి యొక గుద్దలితో నేను వసించు వివరము త్రవ్వి చిరకాలోపార్జితమైన నాధనము సర్వము గ్రహించెను.

4. కింది పేరా చదివి, దిగువనున్న ప్రశ్నలకు సమాధానాలు రాయండి. (10 మార్కులు)

విశ్వామిత్రుని వెంట ధనుర్ధారి అయి రాముడు నడుస్తున్నాడు. లక్ష్మణుడు అనుసరిస్తున్నాడు. సరయూ నదీ తీరం వెంబడి చాలా దూరం ప్రయాణించారు ముగ్గురూ. తరువాత రామలక్ష్మణులకు 'బల','అతిబల' విద్యలనుపదేశించాడు విశ్వామిత్ర మహర్షి. వీటి ప్రభావం వల్ల అలసట, ఆకలిదప్పులు ఉండవు. రూపకాంతులు తగ్గవు. నిద్రలో ఉన్నా, ఏమరుపాటుతో ఉన్నా రాక్షసులేమీ చేయలేరు. ముల్లోకాల్లో ఎదురొడ్డి నిలిచేవారుండరు. రాముడు గురుసేవలో నిమగ్నుడయ్యాడు. విశ్వామిత్రుని పాదాలొత్తాడు. సేవలు చేశాడు. గురుసేవ విశేష ఫలితాన్నిస్తుంది. సరయూనదీ తీరంలోనే వాళ్ళు ఆ రాత్రి నిద్రించారు.

కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.

'కౌసల్యా దేవి సత్సంతానమైన ఓ రామా! తూర్పున ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. నిద్రలేచి నిత్యకర్మలను ఆచరించ'మన్నాడు. గురువాక్యం శిరసావహించాడు రాముడు, లక్ష్మణునితో కలసి. మళ్ళీ ప్రయాణం కొనసాగింది. సరయూ గంగానదుల సంగమ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడి విశేషాలను గురుముఖతః తెలుసుకున్నారు. జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం. ప్రయాణం సాగుతున్నది.'మలద','కరూశ' అనే జనపదాలకు చేరుకున్నారు. ఇంద్రుని అనుగ్రహ విశేషం చేత ఈ ప్రాంతాలు ధనధాన్యాల సమృద్ధితో ఉండేవి. కానీ 'తాటక' అనే యక్షిణి ఈ ప్రాంతాలకు వచ్చి విధ్వంసాన్ని సృష్టించింది. పుట్టుకతోనే వేయి ఏనుగుల బలం కలిగిన ఈమెను ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. 'అగ్నికి ఆజ్యంతోడైనట్లు' ఈమెతోబాటు ఈమె కుమారుడు 'మారీచుడు' విరుచుకుపడుతూ ఈ జనపదాలను అతలాకుతలం చేస్తున్నాడు. దుష్టురాలైన తాటకను వధించమని రాముడితో అన్నాడు విశ్వామిత్రుడు. ఒక్కక్షణం రాముడు మౌనముద్ర దాల్చాడు. రాముడి భావం గ్రహించాడు విశ్వామిత్రుడు. 'స్త్రీని ఎలా చంపాలనే సంశయం వద్దు. అధర్మ పారాయణ అయిన తాటకను చంపితే దోషం రాద'ని కర్తవ్యముపదేశించాడు. వెంటనే

రాముడు దృఢనిశ్చయుడై అంజలి ఘటించాడు. 'మీరు చెప్పినట్లుగా నడుచుకొమ్మని మా నాన్నగారు నన్ను ఆదేశించారు. వారి ఆజ్ఞ నాకు శిరోధార్య'మని పితృవాక్య పరిపాలనాసక్తిని చాటాడు. అలాగే గురువు ఆజ్ఞను పాలించడం శిష్యునిగా తన కర్తవ్యమని భావించి తాటకవధకు ఉద్యుక్తుడైనాడు.

వికృతాకారంతో విరుచుకుపడుతున్న తాటక చేతులను తన నిశిత బాణాలతో ఖండిచాడు రాముడు. అయినా ఆవేశంతో మీదికి వస్తున్న తాటక ముక్కు చెవులను కోసివేశాడు లక్ష్మణుడు. తాటక ఆవేశం రెండింతలైంది. తాను కనబడకుండా వాళ్లపై రాళ్ళ వానకురుస్తుంది. ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు. సంధ్యాకాలం సమీపిస్తున్నది. ఈలోపే తాటకను పరలోకానికి పంపమని పురమాయించాడు. అసురసంధ్యాకాలంలో రాక్షసులు మహాబలాన్ని పొందుతారు. ఎదుర్కోవడం కష్టం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాముడు శబ్దవేధి విద్యను ప్రదర్శిస్తూ బాణప్రయోగం చేశాడు. క్షణకాలంలో తాటక నేలపైబడి ప్రాణాలను వదిలింది. తాటకవధతోదుష్ట సంహారానికి పూనుకొన్నాడు రాముడు. ఇంద్రాది దేవతలు రాముణ్ణి స్తుతించారు. సంతుష్టుడైన విశ్వామిత మహర్షి రామునకు ఎన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించాడు. గురువు అనుగ్రహిస్తే ఇవ్వలేనిదేమిటి? శిష్యుడు పొందలేనిదేమిటి.

ప్రశ్నలు :

1. బల, అతిబలవిద్యలెలాంటివి?
2. తాటక చేసిన విధ్వంసం ఏమిటి?
3. రాముడు తాటక వధకు ఎందుకు పూనుకున్నాడు?
4. తాటకను వధించిన విధమెట్టిది?
5. కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే
   ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.
   అనే శ్లోక తాత్పర్యం ఏమిటి?

5. మానవ చర్యలు జంతు, పక్షి జాతులకు కలుగజేసే నష్టాలను గురించి 150 పదాలకు తగ్గకుండా ఉపన్యాస రూపంలో రాయండి. (10 మార్కులు)

6. మీరు నిర్వహించే పాఠశాలలో అనాథబాలలకు ఉచితవిద్య అందించబడుతుందని 100 పదాలకు తగ్గకుండా పత్రికా ప్రకటనను రాయండి. (10 మార్కులు)

7. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న మీ పాఠశాల ఉపాధ్యాయుడికి అభినందనలు తెలుపుతూ 100 పదాలకు తగ్గకుండా లేఖను రాయండి. (10 మార్కులు)

8. మహిళల పట్ల చూపుతున్న వివక్షలను, వారి మీద జరుపుతున్న దాడులను ఖండిస్తూ, మహిళలందరూ ధైర్యంతో మెలగాలని తెలియజేసేలా 150 పదాలకు తగ్గకుండా చర్చా రూపంలో ఒక వ్యాసం రాయండి. (10 మార్కులు)

9. మీ గ్రామానికి రవాణా సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, తపాలా, టెలిఫోన్ సౌకర్యం కలిగించిన ప్రభుత్వాధికారికి గ్రంథాలయం ఏర్పాటు చేయించమని 150 పదాలకు తగ్గకుండా అర్జీ (దరఖాస్తు) రాయండి. (10 మార్కులు)

10. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న విధానాన్ని గురించి 150 పదాలకు తగ్గకుండా జిల్లా విద్యాధికారికి ఒక నివేదిక రాయండి. (10 మార్కులు)

11. గతంతో పోలిస్తే నేడు వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమేణా తగ్గుతోంది. దీనికి కారణాలు ఏమై ఉంటాయో ఇద్దరు విద్యార్థుల సంభాషించుకుంటే ఎలా ఉంటుందో 150 పదాలకు తక్కువ కాకుండా రాయండి. (10 మార్కులు)

12. ఈ క్రింది గద్యాన్ని ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించండి. (10 మార్కులు)

The motivation to succeed comes from the burning desire to achieve a purpose. Napoleon Hill wrote "whatever the mind of man conceive and believe the mind can achieve".

A young man asked Socrates the secret to success. Socrates told the young man to meet him near the river the next morning. They met, Socrates asked the young man to walk with him toward the river. When the water got up to their neck. Socrates hook the young man by surprise and ducked him into the water. The boy struggled to get out but Socrates was strong and kept him there until the boy started turning blue. Socrates pulled his head out of the water and the first thing the young man did was to gasp and take a deep breath of air. Socrates asked "what did you want the most when you were there?" The boy replied, "Air" Socrates said, "That is the secret to success. When you want success as badly as you wanted the air, then you will get it". There is no other secret. A burning desire is the starting point of all accomplishment. Just like a small fire cannot give much heat, a weak desire cannot produce great results.

13. **ఈ క్రింది వ్యాకరణాంశాలను వివరించండి.**

a) క్రింది పదాన్ని ఉపయోగించి సొంతవాక్యం రాయండి. (1 మార్కు)

పొద్దస్తమానం

b) క్రింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యంగా మార్చండి. (1 మార్కు)

వైద్యుడు ప్రథమ చికిత్స చేస్తాడు. వైద్యుడు మందులు ఇస్తాడు.

c) క్రింది పదానికి విగ్రహవాక్యం రాసి, ఏ సమాసమో గుర్తించండి. (1 మార్కు)

సూర్యచంద్రులు

d) క్రింది పదాన్ని విడదీసి సంధి పేరు రాయండి. (1 మార్కు)

చేయునతడు

e) క్రింది వాక్యంలో గీతగీసిన పదానికి అర్థం రాయండి. (1 మార్కు)

సంజవెలుగులో తటాకంలోని నీరు కొత్త అందం సంతరించుకుంది.

f) "శివాజీ కళ్యాణి దుర్గాన్ని సాధించాడు.

వీరులకు సాధ్యం కానిది లేదు కదా!" – ఈ వాక్యంలోని అలంకారం గుర్తించి, వివరించండి.

(3 మార్కులు)

g) క్రింది వాక్యాన్ని పరోక్ష కథనంలోకి మార్చండి.

"నేను నేటి సినిమాలను చూడలేకపోతున్నాను"అని అమ్మతో అన్నాను. (1 మార్కు)

h) క్రింది వాక్యాలలోని ప్రకృతి, వికృతుల్ని గుర్తించండి. (1 మార్కు)

మూర్ఖులకు నీతులు చెప్పడం వల్ల ఆ మొరకులకు లోకువవుతాము.

i) క్రింది పద్య పాదంలో గీతగీసిన పదంలోని సంధిని గుర్తించి సంధి సూత్రాన్ని రాయండి.

(3 మార్కులు)

"పుణ్యాంగనయు భిక్షయిడదయ్యె గటా !

j) క్రింది పదానికి వ్యుత్పత్త్యర్థం రాయండి. (1 మార్కు)

భాస్కరుడు

k) క్రింది పదానికి పర్యాయపదాలు రాయండి. (1 మార్కు)

ఈశ్వరుడు

l) క్రింది పద్యపాదంలోని ఛందస్సును గుర్తించి, సమన్వయించండి. (5 మార్కులు)

మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యనరమ్ము విశ్వనా